మీరు గెలిపిస్తారు..

కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విజయంపై తనకెలాంటి సందేహం లేదని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కందికుంటతోపాటు హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథిని గెలిపిస్తారని, ఇందులో తనకేమీ సందేహం లేదని అన్నారు.

జనచంద్రం



బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

మరిన్ని వివరాలు 7, మెయిన్‌లో

బహిరంగ సభకు హాజరైన జనం



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ప్రజాగళం సభకు పోటెత్తిన జనం

కిక్కిరిసిన కదిరి వీధులు

కదిరి మొత్తం కదలివచ్చినట్లుందని చంద్రబాబు హర్షం

శ్రేణుల్లో ఉత్సాహం నింపిన అధినేత పర్యటన

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గురువారం కదిరిలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభకు జనం పోటెత్తారు. వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో కదిరి వీధులు కిక్కిరిశాయి. ఎక్కడ చూసినా జనమే జనం. డిగ్రీకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చంద్రబాబు పాల్గొన్నారు. పెద్దఎత్తున ముస్లింలు హాజరయ్యారు. పూలే సర్కిల్‌లో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభకు జనం వెల్లువలా వచ్చారు. చంద్రబాబు ప్రసంగం సాగినంత సేపు ఈలలు, చప్పట్లతో శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి రాగానే సాగునీరిచ్చి, పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధి చేస్తానన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని హామీ ఇచ్చారు. ప్రసిద్ధిగాంచిన కదిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కదిరిపై వరాల జల్లు కురిపించారు. వైసీపీ ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు. ఎకరాకు కూడా నీరివ్వకుండా, టీడీపీ హయాంలో తలపెట్టిన ప్రాజెక్టులను అటకెక్కించి సీఎం జగన్ సీమ ద్రోహిగా మిగిలిపోయాడంటూ ధ్వజమెత్తారు. సభకు హాజరైన జనసందోహాన్ని చూసి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కదిరి పట్టణం మొత్తం తరలివచ్చినట్లుందన్నారు. తాను ఎప్పుడు కదిరికి వచ్చినా.. చాలా ఆనందంగా ఉంటుందన్నారు. అధినేత పర్యటన తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం నింపింది. ముస్లిం మైనార్టీల్లో భరోసా నింపేలా కదిరి ఇఫ్తార్ విందులో చంద్రబాబు హామీలిచ్చారు. మైనార్టీలు పెద్దఎత్తున చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోవడం.. కదిరిలో టీడీపీ ప్రతిష్ఠతను తెలియజేసిందంటూ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కదిరి ప్రజాగళం బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం కనిపించింది. చంద్రబాబు రోడ్‌షోకు జనం నీరాజనాలు పలికారు.

- కదిరి/పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)



కందికుంటతో మాట్లాడుతున్న చంద్రబాబు



ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న చంద్రబాబునాయుడు

కదిరి అభివృద్ధికి తోడ్పడండి

- కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే



ఒక్కచాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్, కదిరిని కూడా నాశనం చేశాడు. అందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారు. నాలుగు సంవత్సరాల 9నెలలుగా కదిరిలో అభివృద్ధి ఆగిపోయింది. యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. సీఎం జగన్‌కు స్థానిక నాయకులపై నమ్మకంలేక ప్రస్తుత ఎన్నికల్లో బళ్లారి నుంచి పార్లమెంటు అభ్యర్థిని, బెంగళూరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిని బరిలో దింపాడు. వీరిపై పుంగనూరు పుడింగి పెత్తనం చేస్తున్నాడు. కదిరిపై వీరి పెత్తనం ఏంటి? టీడీపీతోనే కదిరి అభివృద్ధి సాధ్యం.

జగన్‌తో యుద్ధానికి సిద్ధం

బీకే పార్థసారథి, ఎంపీ అభ్యర్థి




ముఖ్యమంత్రి జగన్ సిద్ధం పేరుతో ప్రజలపై యుద్ధం చేయడానికి వస్తున్నాడు. అదే ప్రజలు.. ఆయనను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారు. టీడీపీ పాలనలో కియలాంటి పరిశ్రమలు తెచ్చి, అనంతను అభివృద్ధిం చేశాం. సాగునీరు జిల్లాకు తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుంది. టీడీపీతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం.



చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థంపుచ్చుకుంటున్న ముస్లింలు

భారీగా చేరికలు

కదిరిలో చంద్రబాబు సమక్షంలో నియోజకవర్గ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 30 మంది టీడీపీలోకి చేరారు. చంద్రబాబు వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, కౌన్సిలర్లు కిష్టప్ప, ఎంఎస్ ఫయాజ్, రంగారెడ్డి, సర్పంచ్ సుధాకర్, మైనార్టీ నాయకులు అహమ్మద్‌బాషా, ఎంఎస్ మహీర్‌బాషా, జాకీర్, సీనియర్ నాయకులు బోర్‌వెల్ రఘు, కడపల రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బొంత అమరనాథ్‌రెడ్డి, గజ్జల శ్వేత, మరికొంతమంది ఉన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న చంద్రబాబు

చంద్రబాబుకు ఘనసన్మానం

కదిరి ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబును వడ్డెర సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిని వడ్డెర సామాజికవర్గానికి చెందిన బీవీ వెంకటరాముడుకు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. వారు చంద్రబాబును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించడానికి సంఘం తరపున కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్, కదిరి వడ్డెర సంఘం నాయకులు డాబా గంగయ్య, ఉత్తన్న, శ్రీనివాసులు, పీట్ల సుధాకర్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

తరలివచ్చిన శ్రీవారు

తరించిన భక్తజనం

కనులపండువగా ఖాద్రీశుడి ప్రజాగరుడసేవ

కదిరిలో బ్రహ్మోత్సవ సందడి



గరుత్మంతుడిపై దర్శనమిస్తున్న శ్రీవారికి మంగళహారతి ఇస్తున్న వేదపండితులు



దర్శనం చేసుకుంటున్న భక్తులు

కదిరి, మార్చి 28: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారికి ప్రజాగరుడసేవ నిర్వహించారు. బుధవారం రాత్రి మోహినీ అవతారంలో బయలుదేరిన శ్రీవారు గురువారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. వెంటనే నిత్యపూజ, హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. సంధ్యాసమయంలో గరుడవాహనంపై కొలువుదీరి శ్రీవారు.. భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కోరినపుడు గరుడవాహనంపై శ్రీవారు కొలువుదీరడాన్ని ప్రజాగరుడసేవ అంటారు. ఈ ఉత్సవాన్ని ఎప్పుడైనా నిర్వహించుకోవచ్చు. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ముందుండి నడిపిస్తున్న ఉత్సవాలు కాబట్టి బ్రహ్మోత్సవాలని పేరు. బ్రహ్మదేవుని ఇష్టవాహనమైన గరుత్మంతుడి వాహనోత్సవాన్ని రెండుసార్లు నిర్వహిస్తారు. బ్రహ్మరథోత్సవానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. వారికి వినోదం పంచేందుకు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు గజవాహనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారు గజవాహనంపై విహరిస్తారు. ఈ వాహన సేవ తరువాతి రోజు బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. ఈ వాహనోత్సవాన్ని వాడుక భాషలో తెల్లటేను మెరవన అంటారు. ఐరావతంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు.

బ్రహ్మరథోత్సవానికి ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్, మార్చి 28: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మరథోత్సవానికి శనివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మైనొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. డిపోలో ఉన్న 110 బస్సులకు అదనంగా 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 20, నల్లమాడకు 10, మదనపల్లికి 20, బెంగళూరుకు 15, పులివెందులకు 7, తలుపులకు 6 బస్సులు నడుపుతామన్నారు. పట్టణంలోని జీవిమాను సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, హిందూపురం రోడ్డులోని సరస్వతి విద్యామందిరం వద్ద ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

వైసీపీ డ్రామా..!

కండువా కప్పుకుంటేనే నాటక ప్రదర్శనకు అనుమతి అంటూ హుకుం

నమ్మి, పార్టీలో చేరిన కళాకారులు

చివరి క్షణంలో నాటకం నిలిపివేత

డ్రామా కోసం పార్టీ మారినా ఫలితం శూన్యం

కళాకారులకు రూ.2 లక్షలు నష్టం

గోరంట్ల, మార్చి 28: వైసీపీ ఓట్ల డ్రామా ఆడింది. మండలంలోని పెరుమాళ్లపల్లిలో పౌరాణిక నాటక ప్రదర్శనకు అనుమతి విషయంలో కళాకారులను నమ్మించి, మోసం చేసింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెరుమాళ్లపల్లికి చెందిన 20మంది కళాకారులు చందాలు వేసుకుని, నవరత్నాలు నాటకాన్ని ప్రదర్శించాలని భావించారు. ఇందుకోసం నాలుగు నెలలక్రితం అనంతపురం నుంచి డ్రామా మాస్టార్‌ను పిలిపించుకుని, శిక్షణ పొందారు. ఈనెల 28న నాటకాన్ని ప్రదర్శించాలనుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అధికారుల అనుమతి లభించలేదు. స్థానికంగా వైసీపీలో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గం డ్రామా గురించి తెలుసుకుని, దానికి తమకు అనుకూలంగా మలచుకోవాలనుకున్నారు. కళాకారులు, టీడీపీ సానుభూతిపరులైన మల్లికార్జున, సుధాకర్, కృష్ణకుమార్, విశ్వనాథ్, నారాయణస్వామి తదితరులను మంగళవారం పార్టీ పిరాయించేలా చేశారు. తమ పార్టీలో చేరితే డ్రామాకు ఎవరూ అడ్డుచెప్పరనీ, నిరభ్యంతరంగా ఆడుకోవచ్చని నమ్మబలికారు. ఆ మేరకు పెనుకొండ వైసీపీ అభ్యర్థి, మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో వారికి రెండ్రోజుల క్రితం వైసీపీ కండువాలు కప్పారు. దీంతో పెరుమాళ్లపల్లిలో బుధవారం రాత్రి నాటక ప్రదర్శనకు సిద్ధమయ్యారు. స్టేజ్ ఏర్పాటు చేసి, ధర్మవరం నుంచి సెట్టింగ్స్, లైటింగ్ తెప్పించి, ఏర్పాటు చేసుకున్నారు. అనంతపురం నుంచి ఇద్దరు మహిళా కళాకారులు, వాయిద్య బృందాన్ని రప్పించారు. రాత్రి 9 గంటల సమయంలో పూజ చేసి, ప్రార్థనా గీతంతో నాటకాన్ని ప్రారంభించాలన్న తరుణంలో ప్రభుత్వ అధికారులు ఎంసీసీ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, పీఆర్ డీఈ వెంకటరమణ, ఎస్ఐ బాలాజీ గ్రామంలో ప్రత్యక్షమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రదర్శనకు అనుమతి లేదనీ, వెంటనే నిలిపివేయాలన్నారు. దీంతో కళాకారులు కేసుల్లో ఇరుక్కోవడం ఎందుకని భావించి, మిన్నకుండిపోయారు. నాటకాన్ని ఆపివేయడంతో కళాకారులు ప్రదర్శన జరగకుండానే వేసుకున్న రంగులు కడిగేసుకోవాల్సి వచ్చింది. వైసీపీ వారి మాటలు నమ్మినందుకు రూ.2 లక్షల నష్టంతో పాటు, అవమాన పడాల్సి వచ్చిందని బాధిత కళాకారులు వాపోయారు. అధికారులు అర్ధరాత్రి దాటేవరకు గ్రామంలోనే ఉండి స్టేజీని పూర్తిగా తొలగింపజేశారు. వైసీపీలోని మరోవర్గం వారే.. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామంలో చర్చ సాగుతోంది. ఈలెక్క న వైసీపీ వారే డ్రామా ఆడుకోవచ్చని నమ్మించి, పార్టీలో చేర్పించుకుని తిరిగి వారే.. ఫిర్యాదు చేయడంపై ఎంత మోసం అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నాటక ప్రదర్శనను అడ్డుకుంటున్న అధికారులు, వైసీపీ అభ్యర్థి భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న పెరుమాళ్లపల్లి వాసులు (ఫైల్)



చంద్రబాబుకు స్వాగతం చెప్పేందుకు..



బాబుకు స్వాగతం పలుకుతున్న నేతలు





గొర్రెపిల్లతో చంద్రబాబు..



జై తెలుగుదేశం..

బాబు వరాలు..

టీడీపీ అధినేత చంద్రబాబు రాప్తాడు నియోజకవర్గానికి వరాల జల్లులు కురిపించారు. అధికారం లోకి రాగానే అనేక అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. పేరూరు చెరువుకు నీళ్ల ఇచ్చే బాధ్యత టీడీపీదేనని అన్నారు. అనంతపురం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమరవాండ్లపల్లి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని అన్నారు. టమోటా, వేరుశనగ, చీనీ తదితర వాణిజ్య పంటలకు సబ్సిడీ వర్తింపజేస్తామన్నారు. చెన్నే కొత్తపల్లి మండలం వెంకటపల్లి సమీపంలోని దేవరకొండ ప్రాజెక్టు విషయంలో రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు చెల్లిస్తామని అన్నారు.



రాప్తాడు ప్రజాగళం సభకు పోటెత్తిన అభిమానులు

● జగన్ రాక్షస పాలన



ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనుకబడిపోయింది. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14కుగానూ టీడీపీని 12 స్థానాల్లో గెలిపించారు. చంద్రబాబు అనంతను అభివృద్ధి పథంలో నడిపించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రూ.13 వేల కోట్లతో పెనుగొండ వద్ద కియ పరిశ్రమ ఏర్పాటు చేయించారు. దీంతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. యువతకు 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే. హంద్రీనీవా పూర్తి చేసి గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నిరిచ్చి రైతులను ఆదుకున్నారు. సబ్సిడీతో రైతులకు డ్రిప్పు, ఏటా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి అండగా నిలిచారు. 2019లో కూడా ముఖ్యమంత్రి అయ్యుంటే జిల్లాను మరింత అభివృద్ధి చేసేవారు. కియకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు వచ్చేవి. యువతకు మరిన్ని ఉద్యోగాలు వచ్చేవి. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే 2 ఎంపీలను గెలిపించుకోవాలి.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ అభ్యర్థి



అక్రమాలకు అడ్డాగా మార్చారు



వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తోపుదుర్తి సోదరులు రాప్తాడును అవినీతి, అక్రమాలు, అరాచకాలకు అడ్డాగా మార్చేశారు. అక్రమార్జనతో రూ.కోట్లు సంపాదించారు. సొంత పార్టీ నేతలను కూడా ఇబ్బంది పెడుతున్నారు. భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కమీషన్లు వసూలు చేసి కోట్లకు పడగలెత్తారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు సహకారంలో రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిచింది. వైసీపీ ప్రభుత్వంలో అరాచక పాలన సాగించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎత్తిన టీడీపీ జెండా కిందకు దించలేదు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వెళ్లారు. ఎన్నికలు దగ్గర పడ్డాయి. ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలి. అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు రాప్తాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారు. ఖచ్చితంగా టీడీపీ అధికారంలోకి వస్తుంది. రాప్తాడు నియోజకవర్గాన్ని చంద్రబాబు మరింత అభివృద్ధి చేస్తారు.

- పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి



దోపిడీ తోపులు

రాప్తాడు ఎమ్మెల్యే పిల్ల సైకో

రూ.15 కోట్లు డిమాండ్ చేసి జాకీని తరిమేశారు

ఎమ్మెల్యే తోపుదుర్తిపై టీడీపీ అధినేత చంద్రబాబు ఫైర్

రాప్తాడు, మార్చి 28: సీఎం జగన్ రాష్ట్రానికి సైకో అని, రాప్తాడులో కూడా పిల్ల సైకో తయారయ్యాడని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దోపిడీలో తోపుగా మారాడని అన్నారు. రాప్తాడులో గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. తోపుదుర్తి సోదరులు కమీషన్ల పేరిట దోపిడీ చేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ తీసుకొస్తే.. తోపు రూ.15 కోట్లు కమీషన్ డిమాండ్ చేశారని, దీంతో జాకీ తెలంగాణకు తరలిపోయిందని అన్నారు. రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటై ఉంటే వందల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించేవని అన్నారు. రాప్తాడు సమీపంలోని ఆటో నగర్ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాల డెయిరీ పేరుతో రూ.కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గం ఒకప్పుడు అభివృద్ధిలో ముందుండేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి, భూ దందాలు, ఇసుక, మట్టి మాఫియాతో కుతకుతలాడిపోతోందని అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన ఎమ్మెల్యే.. పనులు చేయకుండా రూ.కోట్లు కొల్లగొడుతున్నాడని విమర్శించారు. వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమంగా కేసులు పెట్టారని, బొక్కిన వాడిని ఎవరినీ వదిలి పెట్టనని చంద్రబాబు అన్నారు. 'మా తమ్ముళ్లు పడిన కష్టాలకు వడ్డీతో చెల్లించే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. అన్నింటిపై విచారణ జరిపించి, దోషులను శిక్షించే బాధ్యత తనదేనని అన్నారు.

దోపిడీదారులను గద్దె దించాలి



వైసీపీ అధికారంలోకి వచ్చాక రాప్తాడులో తోపుదుర్తి సోదరులు దోపిడీదారులుగా మారారు. ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి వారిని ఇంటికి సాగనంపాలి. కూటమి అభ్యర్థి పరిటాల సునీత గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కియ పరిశ్రమ తరహాలో రాప్తాడులో కూడా ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. రాప్తాడును అభివృద్ధి పథంలో నడిపించాలి.

- పాకే పవన్, జనసేన రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి

3 వేల కేసులు పెట్టారు

- మాజీ మంత్రి పరిటాల సునీత



వైసీపీ అధికారంలోకి వచ్చిన తారువాత తనపైన, పరిటాల శ్రీరామ్ పైన, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలపైన మొత్తం మూడు వేల అక్రమ కేసులు పెట్టించారని వైసీపీ నాయకులపై మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. జిల్లాలో ఎక్కడా లేనన్ని కేసులు రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం పెట్టించిందని అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా రాక్రీట్ సంస్థ పేరుతో రాప్తాడు ఎమ్మెల్యే రూ.వేల కోట్లు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఐదు జిల్లాలలో కాంట్రాక్టు తీసుకుని, అక్రమంగా కోట్లు సంపాదిస్తున్నారని అన్నారు.

● టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ తీసుకొస్తే వైసీపీ అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే, ఆయన సోదరులు రూ.15 కోట్లు డిమాండ్ చేసి తెలంగాణకు తరిమికొట్టారని అన్నారు. పాల డెయిరీ ఏర్పాటు చేస్తామని ఒక్కో డ్వాక్రా మహిళలతో రూ.10 వేలు చొప్పున రూ.10 కోట్లు వసూలు చేశారని, నాలుగేళ్ల తరువాత తాము నిలదీస్తే కొంత మంది మహిళలకు మాత్రమే డబ్బు వెనక్కి ఇచ్చారని అన్నారు. నాలుగేళ్లు ఆ డబ్బుతో రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేశారని ఆరోపించారు.

● అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక, మట్టి మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేశారని అన్నారు. 'రిజర్వాయర్లు నిర్మించి, పిల్ల కాలువల ద్వారా లక్ష ఎకరాలకు నీరిస్తామని ప్రకాష్‌రెడ్డి జగన్ సమక్షంలో రైతులకు హామీ ఇచ్చారు. హామీ నెరవేర్చకపోతే మీసం తీయించుకుంటా అన్నాడు. రిజర్వాయర్ల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదు. రైతులకు ప్రకాష్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ఎన్నికల ముందు నా బనియన్ బొక్కలు పడ్డాయి, ఇల్లు అమ్ముకున్నా.. ఈ సారి ఓటు వేయకపోతే పూల దండ వేయాల్సిందే అని చెప్పారు. గెలుపు కోసం పని చేసిన బీసీ, ఎస్సీ ఎస్టీలను అధికారంలోకి వచ్చాక ప్రకాష్‌రెడ్డి ఇంటి గేటు కూడా తాకనివ్వలేదు. అలాంటి వ్యక్తికి ఎన్నికల్లో ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పేందుకు రాప్తాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూస్తున్నారు..' అని పరిటాల సునీత అన్నారు.

● జగన్ ఫ్యాక్షన్ సీఎం అని, ఆయనను గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గంలో రూ.5 వేల కోట్లతో అభివృద్ధి చేశామని, 45 చెరువులు, చెక్‌డ్యాంలకు నీరిచ్చామని అన్నారు. పేరూరు డ్యాంకు శాశ్వతంగా నీరిచ్చేందుకు రూ.803 కోట్లతో కాలువ పనులు ప్రారంభించామని, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. కాలువ కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిహారం ఇవ్వాలని చంద్రబాబును కోరారు. పది ఎకరాల భూమి ఉందని సాకు చూపుతూ.. రేషన్ కార్డులు, పింఛన్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. 'రాప్తాడు ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, గంగలకుంట చెరువుకు శాశ్వతంగా నీరు వచ్చేందుకు నిధులు, సీకే పల్లిలో హార్టికల్చర్ హబ్, రూరల్ మండలానికి తాగునీరు, నడిమి వంకకు రక్షణ ఏర్పాటు చేయాలని చంద్రబాబును కోరారు. ఎన్ని కష్టాలు వచ్చినా పరిటాల కుటుంబం మీ వెంటే ఉంటుందని చంద్రబాబుకు ఆమె హామీ ఇచ్చారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి: ఆలం



ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పిలుపునిచ్చారు. అనంతపురం ఎంపీగా తలారి రంగయ్యను గెలిపిస్తే.. ఐదేళ్లలో ఎక్కడ ఉన్నారో ప్రజలకు తెలియదని అన్నారు. అలాంటి వైసీపీ నేతలను మళ్లీ గెలిపిస్తే.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని అన్నారు. శింగనమలలో ఏ పని జరగలన్నా ముడుపులు ముట్టజెప్పాల్సివస్తోందని విమర్శించారు. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇలాంటి అవినీతి ఎమ్మెల్యేని చూడలేదని అన్నారు. ఐదేళ్లు డబ్బు సంపాదించుకుని, ప్రస్తుతం అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు.

శింగనమలను దోచేశారు

- ఎమ్మెల్యే ఆమె భర్త అవినీతికి అడ్డు లేదు
- కాళ్ల వద్ద పడుంటాడని టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చారు
- శ్రావణి శ్రీని గెలిపించండి.. అభివృద్ధి చేసే బాధ్యత నాది
- బుక్కరాయసముద్రం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



ప్రసంగిస్తున్న బండారు శ్రావణిశ్రీ →



బుక్కరాయ సముద్రంలో బాబు ప్రసంగం..

బుక్కరాయసముద్రం, మార్చి 28: శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి అవినీతికి అడ్డు అదుపు లేకుండాపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యేని కాదని, వారి ఇసుక టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చారని, అలా అయితే నియోజకవర్గం అంతటా దోచుకోవచ్చని వారి ఆలోచన అని విమర్శించారు. బుక్కరాయసముద్రంలో గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే, ఆమె భర్త నియోజకవర్గంలో 500 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. రెండున్నర ఎకరాల ఎస్సీల శ్మశాన భూమిని కూడా కబ్జా చేశారంటే.. పరిస్థితి ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను ఆక్రమించారని, సోలార్, విండ్ పవర్ కంపెనీ యాజమానులను బెదిరించి, నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. సీఎం జగన్, సాంబశివారెడ్డి పథకం ప్రకారం వైసీపీ అభ్యర్థిని ఎంపిక చేశారని అన్నారు. అగ్రవర్ణాల వారి కాళ్ల వద్ద పడి ఉంటారని టిప్పర్ డ్రైవర్‌ను అభ్యర్థిగా పెట్టారని, వారి తెలివికి జోహార్లు అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతోందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో శింగనమలలో చరిత్ర తిరగరాస్తామని అన్నారు.

శ్రావణిని గెలిపించండి..

● జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, టీడీపీ అభ్యర్థి శ్రావణి శ్రీని గెలిపిస్తే తాము నెరవేరుస్తామని చంద్రబాబు అన్నారు. టిప్పర్ డ్రైవర్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో అంధకారం అలుముకుంటుందని హెచ్చరించారు. పార్టీ ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితర సీనియర్ నాయకులు కలిసి పనిచేసి శ్రావణిని గెలిపించాలని సూచించారు. వారి భవిష్యత్తుకు పార్టీ భరోసా కల్పిస్తుందని అన్నారు.

ఏం చేశావో చెప్పు జగన్..

శింగనమల నియోజకవర్గానికి గడిచిన ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని సీఎం జగన్‌ను చంద్రబాబు నిలదీశారు. ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక అనేక హామీలు ఇచ్చారని,ఈ ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. 'శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.162 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కానీ ప్రారంభించలేదు. శింగనమలలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. మిడ్ పెన్నార్ డ్యాంకు గేట్లు మరమ్మతులు, లీకేజీ నివారణకోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ పనులు చేయలేదు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంత వరుకు ఏర్పాటు చేయలేదు. గార్లదిన్నె, శింగనమలలో టీడీపీ హయంలో 95 శాతం నిర్మించిన షాదీఖానాలు ఇప్పటి వరుకు పూర్తి చేయలేదు. ఇలాంటి ముఖ్యమంత్రి రాజధానిని కడతారా? ప్రజలు ఆలోచించాలి' అని చంద్రబాబు అన్నారు.

అవినీతి కావాలా..? సేవ కావాలా..?

- బండారు శ్రావణి శ్రీ

'శింగనమల నియోజకవర్గంలో అవినీతి ఎమ్మెల్యే కావాలా..? నిరంతరం ప్రజలకు సేవ చేసే నాయకురాలు కావాలా..? మీరే నిర్ణయించుకోండి' అని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ ప్రజలను కోరారు. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి దౌర్జన్యాలు, అవినీతితో పేట్రేగిపోయారని అన్నారు. 'ఎమ్మెల్యే అవినీతికి పాల్పడినందుకే ఆమెకు టిక్కెట్ నిరాకరించారని వైసీపీ నాయకులే అంటున్నారు. మళ్లీ దోచుకునేందుకు వారి ఇసుక దందాలో భాగస్వామ్యం అయిన టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇప్పించుకున్నారు. బినామీ అయితే నియోజకవర్గంలో మరింత దోచుకోవచ్చుని పథకం వేశారు..' అని శ్రావణి విమర్శించారు. 'మీ ఆడబిడ్డగా సేవ చేసేందుకు ఒక అవకాశం ఇవ్వండి' అని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పెత్తందార్ల వ్యవస్థ కొనసాగుతోందని, ఆలూరు సాంబశివారెడ్డి అరాచకాలకు నియోజకవర్గం ప్రజలు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

● ఉమ్మడి జిల్లాలో వెనుకబడిన కులాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాలలో ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు అన్నారు. పార్టీకి వెన్నెముకలాంటి బీసీలకు తగిన న్యాయం చేస్తామని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు కురుబ కులస్థులు కంబళి, గొర్రెపిల్లను బహూకరించారు.

సాగునీటితోనే అనంత అభివృద్ధి

మైనార్టీ విద్యాసంస్థలు పూర్తి చేస్తాం

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు.. టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటన

వలసలు ఆపడానికి అనంతలో మరిన్ని పరిశ్రమలు



తమ్ముళ్లూ.. వైసీపీకి చరమగీతం పాడండి



దారి పొడవునా అభిమానమే..

కదిరి, మార్చి 28: సాగునీటితోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి సాధ్యమని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించారు. పూలే సర్కిల్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు నీరు వస్తే పంటలు పండుతాయన్నారు. నీరు వస్తే పరిశ్రమలు కూడా వస్తాయనీ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పంటలు, పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. కియ లాంటి పరిశ్రమలు మరెన్నో జిల్లాకు తీసుకొస్తామన్నారు. యువతకు ఇంటి వద్దే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల వద్దే ఉద్యోగాలు చేసుకునే సౌకర్యం కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గం పులివెందుల పక్కనే ఉన్న కదిరిని అభివృద్ధి చేయకుండా, బాబాయిని చంపడానికి ఓ గొడ్డలి తయారీకి ఉపయోగించారని ఎద్దేవా చేశారు.



జనమే.. జనం





యువహో..

కదిరికి వరాల జల్లు



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభలో కదిరికి వరాలు జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే కదిరిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా తానే ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు తీసుకు వస్తానన్నారు. హంద్రీనీవా జలాలను సంబులపూలకుంట, గాండ్లపెంట, తలుపుల మండలాలకు ఇస్తామన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కదిరి బైపాస్ రోడ్డును ఔటర్ రింగ్‌రోడ్డుగా మారుస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న కదిరిలోని అన్ని మైనార్టీ విద్యాసంస్థలను పూర్తి చేస్తామన్నారు. కదిరిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథిని గెలిపిస్తారనీ, ఇందులో తనకేమీ సందేహం లేదన్నారు. కార్యక్రమంలో కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, బీజేపీ యువ మోర్చా నాయకుడు వంశీ తదితరులు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న టీడీపీ కదిరి ఇన్‌చార్జి కందికుంట ప్రసాద్



కార్యకర్త జోరు..

ప్రజాభిప్రాయం మేరకు ముందుకెళ్తాం: చిలకం


సమావేశంలో మాట్లాడుతున్న చిలకం మధు

ధర్మవరం, మార్చి 28: ధర్మవరం నియోజకవర్గ ప్రజలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని ముందుకెళ్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మవరంలో వైసీపీ అరాచకాలను ఐదేళ్లగా ఎదుర్కొన్నామన్నారు. ఇందులో భాగంగా సేవ్ ధర్మవరం కార్యక్రమంలో అనేక హామీలిచ్చానని, వాటిని నెరవేర్చలేకపోతున్నందుకు ప్రజలు క్షమించాలని కోరారు. మిత్రపక్ష అభ్యర్థిగా సత్యకుమార్ యాదవ్ నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలతోనూ సమావేశాలు ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలను తెలుసుకుని అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. 20 ఏళ్ల నుంచి ప్రతిసారి అభ్యర్థి విషయంలో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఈసారి కొందరి ఆలోచనల వల్ల పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్‌యాదవ్‌ను ప్రకటించారని అన్నారు. ధర్మవరం పరిస్థితుల గురించి సత్యకుమార్‌యాదవ్‌తో త్వరలోనే మాట్లాడతామన్నారు. ఆయన ఎన్నికలలో విజయం సాధించాలని చిలకం ఆకాంక్షించారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 28: జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన సంస్కృతం, అరబిక్, పారసిక్ పరీక్షలకు 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ. మీనాక్షి తెలిపారు. 35 పరీక్ష కేంద్రాలలో 1358మంది విద్యార్థులు పరీక్షలురాయాల్సి ఉండగా.. 1334 మంది హాజరైనట్లు తెలిపారు. 24 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో 98 శాతం హాజరు నమోదైందని ఆమె తెలిపారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

కదిరి, మార్చి 28: మండలంలోని సున్నపుగుట్టతండా ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాఠశాలలోని కొన్ని వస్తువులను అమ్మడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చారు. దీనిపై విద్యాధికారులు విచారణ చేసి నివేదికలు పంపారు. ఇందుకు గాను గురువారం జిల్లా ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయున్ని సస్పెండ్ చేసినట్లు సమాచారం. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

వృద్ధురాలికి చేయూత


వృద్ధురాలికి సేవ చేస్తున్న వందేమాతరం సభ్యులు, ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి

తనకల్లు, మార్చి, 28: మండలంలోని దేవలంతండా సమీపంలో రోడ్డు పక్కన ఓ అనాథ వృద్ధురాలిని ఎవరో నాలుగు రోజుల క్రితం వదలి వెళ్లారు. అప్పటి నుంచి ఆమె రోడ్డు పక్కనే ఉండిపోయింది. ఈ విషయాన్ని పక్కనే ఉన్న మామిడి తోట యజమానికి మునీర్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. అయినా ఎవరూ స్పందించలేదు. గురువారం కోటపల్లి గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ రంజిత కొక్కంటి క్రాస్‌లోఉన్న వందేమాతరం టీమ్‌కు సమాచారం అందించారు. టీమ్ సభ్యులు అశోక్, గజేంద్ర, శ్రీనివాసులు తదితరులు వృద్ధురాలి వద్దకు చేరుకుని అమడగూరు మండలంలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి తరలించడానికి ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతితో సంప్రదించారు. నిర్వాహకురాలు వెంటనే చేరుకుని వృద్ధురాలికి వందేమాతరం టీమ్ సభ్యులతో కలిసి జుట్టు కత్తిరించి, స్నానం చేయించి ఆస్పత్రికి తరలించారు. తర్వాత విషయాన్ని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు తెలిపారు. స్పందించిన తహసీల్దార్ ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వాహనాల తనిఖీ


ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వంశీకృష్ణ

ఓబుళదేవరచెరువు, మార్చి 28: మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన పెద్దగుట్టపల్లిలో గురువారం వాహనాలను ఎస్ఐ వంశీకృష్ణ తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ కిశోర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

నంబులపూలకుంట, మార్చి 28: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నుంచి అర్హులైన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ఆయన యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డయాలసిస్, దీర్ఘకాలిక వ్యాధులు, వెన్నునొప్పి తదితర వాటితో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. మూల్యాంకన కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రామాంజులు , రమణనాయక్, సందీప్‌కుమార్, షరీఫ్, రహీమ్, ముష్కీర్‌అహమ్మద్, మంజుభార్గవి, వహీద, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా..!

- వైభవంగా మధుగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

చిలమత్తూరు, మార్చి 28: కదిరి పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మండలంలోని సోమఘట్ట మధుగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నర సింహ స్వామికి సుప్రభాత సేవతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం స్వామి వారి బ్రహ్మరథాన్ని సిద్ధం చేయగా, ఆలయ అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సేవకులు సంప్రదాయ మంగళవాయిద్యాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి తీసుకొచ్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్యన స్వామిని రథంపై ఆసీనులను చేశారు. దీంతో ఆల య ప్రాంగణమంతా నారసింహా నమోనమః అనే స్మరణ మార్మోగింది. ముం దుగా నిర్ణయించిన ముహూర్త సమయానికి రథం ముందుకు కదిలింది. భక్తులు వెంట తెచ్చుకున్న ధవనం, అరటిపండ్లను రథంపైకి చల్లి మొక్కులు తీర్చుకున్నా రు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.


భక్తుల మధ్య కదులుతున్న రథం, (ఇన్‌సెట్‌లో) రథంలో ఆశీనులైన స్వామివారు

కూటమి గెలుపే లక్ష్యం

- కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
- మాజీ మంత్రి పల్లె పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి/బుక్కపట్నం, మార్చి 28: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని, ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రశాంతిగ్రామంలో గల తన నివాసంలో గురువారం ఆయన బుక్కపట్నం మండలం కృష్ణాపురం, యాదాలంకపల్లి, మారాల గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలకు ఆదరణ పెరుగుతోందన్నారు. వీటిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో బూత్‌స్థాయి యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు అత్యంత కీలకమన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ వారు అనేక కుట్రలకు తెరలేపుతారని, వాటిని ఎప్పటికప్పుడు పసిగట్టి తిప్పికొట్టాలని తెలిపారు. భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో పల్లె సింధూరారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ చింతామల్లిరెడ్డి, నాయకులు గోపాలపురం గంగాధర్, వల్లపురవి, లింగప్పగారిపల్లి రవి, ఉత్తప్ప, బెస్తచలపతి, నారాయణస్వామి, రెడ్డెప్ప, కిష్టప్ప, అంజనేయులు, హరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


బడేనాయక్ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి: మున్సిపల్ పరిధిలోని బీడుపల్లి, బడేనాయక్ తండా, గోనేనాయక్‌తండాల్లో గురువారం సాయంత్రం మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వమించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే ఆ పథకాలన్నీ అమలవుతాయని తెలిపారు. ఆ పథకాల వల్ల కలిగే లబ్ధిని తెలియజేశారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ఆయన పరిపాలనతోనే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో పల్లె సింధూరారెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సత్యసాయి నడయాడిన పుట్టపర్తి గడ్డపై అరాచకాలు చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంటను ఇంటికి పంపాలని పల్లె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్, కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు బెస్తచలపతి, మహమ్మద్‌రఫీ, ఉమాపతి, బేకరి నాయుడు, పల్లప్ప, గంగాధర్, శ్రీరాములు, నాయకులు వెంకటేశ్‌నాయక్, దేవేంద్రనాయక్, బాలాజీనాయక్, జూబేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

- కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం


కిడ్నాప్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

కొత్తచెరువు, మార్చి 28: మండలకేంద్రానికి చెందిన ఉప్పు వెంకటాచలపతిని ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాధితుడు వెంకటాచలపతి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేపట్టారు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం క్రాస్‌వద్ద గురువారం తెల్లవారుజామున 8 మందిని అరెస్టు చేశారు. కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వాసుదేవన్ సీఐ రాజారమేశ్‌తో కలిసి అరెస్టు వివరాలను వెల్లడించారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఉప్పుచలపతి చికెన్‌సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగించేవారు. అయితే అతడి సమీప బంధువు అయిన భానుచందర్ పెనుకొండలో పంక్చర్ షాపు నిర్వహించేవాడు. వ్యసనాలకు బానిస అయిన అతను ఎలాగైనా అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పెనుకొండ ప్రాంతంలో ఉన్న తన స్నేహితులు, కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తన బంధువుల సహాయంతో ప్రణాళిక ప్రకారం చలపతిని కిడ్నాప్ చేయడానికి పథకం వేశాడు. ఈ క్రమంలో చలపతిని ఈనెల 24న తన ఇంటి సమీపంలో కిడ్నాప్ చేసి కారులో ముదిగుబ్బ వైపునకు వెళ్లా రు. విషయం పసిగట్టిన చలపతి భార్య 100 కాల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో తాము దొరికిపోతామన్న భయంతో వారు చలపతిని ముదిగుబ్బ గ్రామ శివారులో వదిలి పారిపోయారు. కిడ్నాప్‌నకు యత్నించిన 8 మందిని అదుపులోకి తీసుకున్నామని, అందులో ఒక బాలనేరస్థుడు కూడా ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. అలాగే కారు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పెనుకొండ మండలం షైలపురం గ్రామానికి చెందిన భానుచందర్, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి మొండిగట్ల శ్రావణ్, రొద్దం మండలం బొక్సంపల్లికి చెందిన హరిజన సూరి, కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రుషికేశవరెడ్డి, వంగ విష్ణువర్ధన్, ఇరగంశివగంగాధర్‌రెడ్డి, ఇరగం గంగాధర్‌రెడ్డి, కడపజిల్లా రాజుపాళ్యం మండలానికి చెందిన కందుకూరు శివకిశోర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును చేధించిన సీఐ రాజారమేశ్, ముదిగుబ్బ పోలీసులను ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతికి ఎంపిక చేశారని చెప్పారు.


వేరుశనగ నూర్పిడి యంత్రంపై ప్రయాణిస్తున్న కూలీలు

ప్రమాదపుటంచున ప్రయాణం

ముదిగుబ్బ, మార్చి28: చాలాచోట్ల కూలీలు తరచూ ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తుంటారు. ముఖ్యంగా ట్రాక్టర్లపై, లారీలపై, ఆటోల్లో, బోరులారీలపై, ఏవేని యంత్రాలపై ఎలా పడితే అలా కూర్చొని ప్రయాణిస్తుంటారు. వ్యవసాయ కూలీలు అయితే ఒక పొలం నుంచి మరొక పొలానికి నూర్పిడి యంత్రాలపైనేకూర్చొని వెళుతుంటారు. ఈ క్రమంలో గురువారం మండలకేంద్రం మీదుగా పొడరాళ్లవైపునకు వెళ్తున్న ఓ నూర్పిడి యంత్రంపై పలువురు కూలీలు ప్రమాదపుటంచుల్లో ప్రయాణించారు. ఇది చూసిన స్థానికులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందారు. గతంలో ఇలాంటి ప్రయాణాలు చేసి చాలా మంది కూలీలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇంత జరుగుతున్నా కూలీలు జాగ్రత్తలు తీసుకోకపోవడం బాధాకరం.

బోరుమోటార్ల చోరీపై ఫిర్యాదు

నల్లమాడ, మార్చి 28: మండలంలోని పులగంపల్లిలో ముస్లిం శ్మశాన వాటిక సమీపంలో రెండు బోరు మోటార్లు చోరీకి గురైనట్లు సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీకి సంబంధించిన రెండు తాగునీటి బోర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లతో పాటు పంపు బుధవారం చోరీకి గురైనట్లు చెప్పారు. దాదాపు రూ.లక్షవరకు పంచాయతీకి నష్టం జరిగిందన్నారు. రెండు నెలల క్రితం నూతన సచివాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కూడా చోరీకి గురైందన్నారు. అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసుల గస్తీ ఏర్పాటు చేసి, మోటార్లు చోరీ చేసినవారిని పట్టుకుని న్యాయం చేయాలని సర్పంచ్ కోరారు.

ఇఫ్తార్ విందులో పల్లె

పుట్టపర్తి రూరల్, మార్చి 28: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణపల్లిలో గురువారం రాత్రి ఈవిందు జరిగింది. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీలకు చంద్రబాబు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఇమాంలకు, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకున్నారన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రార్థనలు, విందు చేశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మహమ్మద్‌రఫీ, అబ్దుల్, పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.


భక్తి గీతాలను ఆలపిస్తున్న సత్యసాయి విద్యార్థులు

అలరించిన భక్తి గీతాలు

పుట్టపర్తి, మార్చి 28: సత్యసాయి విద్యార్థులు గానంతో భక్తులను అలరింపజేశారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్‌లో గురువారం సాయంత్రం సత్యసాయి సంగీత కళాశాల విద్యార్థులు సాయిస్వర తాళార్పణం పేరిట వాయిద్యగాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటపాటు వీణ, తబలా వాయిద్యాలతో పాటలు ఆలపించి, భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వేరుశనగ పొలాల్లో పంటకోత ప్రయోగం


మేకలచెరువులో పంటకోత ప్రయోగాలు చేస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, మార్చి 28: మండలంలో రబీలో సాగు చేసిన వేరుశనగ పొలాల్లో పంటకోత ప్రయోగాన్ని వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గంగిరెడ్డులవారిపల్లి, మేకలచెరువు పంచాయతీల్లో పంట కోత ప్రయోగాలు చేయగా.. ఎకరాకు 9900 కేజీలు, అలాగే మరకొమ్మదిన్నె, పెలిచెలమల గ్రామాల్లో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కార్యక్రమంలో ఏఈఓ పాటు ఆర్బీకే సిబ్బంది హరి, సున్నుబాషా, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో అదనపు తరగతులు నిర్వహించరాదు

ధర్మవరం, మార్చి 28: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేసవిలో అదనపు తరగతులు నిర్వహించరాదని ఎంఈఓ-1, 2లు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. వేసవి కాలంలో ఉండాల్సిన పద్ధతులపై విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించికూడా ఆయాపాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అంతేకాకుండా వేసవి సెలవుల్లో పిల్లలను బావులు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు.

ఉద్యోగ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న ఉద్యోగుల సంఘం నాయకులు

పుట్టపర్తి, మార్చి 28: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని అబ్దుల్‌కలాంషాదీఖానాలో జిల్లాలోని ఉద్యోగులు సమావేశమయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘురామనాయుడు ఎన్నికల అధికారిగా ఆ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా నారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగేంద్రనాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుందర్‌రాజుతో పాటు మరికొంతమంది ఉద్యోగులను కమిటీలో ఎంపిక చేశారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమం కోసం పాటు పడతానని జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. కడప, అనంతపురం జిల్లాల అధ్యక్షులు రమేశ్, గోపీకృష్ణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

చిలకంపై కేసు కొట్టివేత

ధర్మవరం, మార్చి 28: 2019వ సంవత్సరంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ధర్మవరంలో పర్యటించినప్పుడు రోడ్లపై మైకులు ఏర్పాటుచేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసినట్లు పోలీసులు తెలిపారు. 2019లో పవన్‌కల్యాణ్ వచ్చిన సందర్భంగా ధర్మవరంలో మైకులు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు కల్గించారని, అప్పట్లో పోలీసులు చిలకం మధుసూధన్‌రెడ్డిపై కేసునమోదు చేశారు. అప్పటి నుంచి ఐదేళ్లపాటు కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం ధర్మవరం సీనియర్‌సివిల్ కోర్టులో ఆ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు. కోర్టు నిజానిజాలు తెలుసుకుని కేసును కొట్టివేయడంపై చిలకం మధు హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి


తలారి చంద్రశేఖర్ మృతదేహం

ధర్మవరం రూరల్, మార్చి28: మండలంలోని రావులచెరువు వీఆర్‌ఏ తలారి చంద్రశేఖర్(52) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తలారిచంద్రశేఖర్ గత కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా గురువారం సాయంత్రం ఉన్నట్టుండి ఛాతిలో నొప్పిరావడంతో కుప్పకూలాడు. కుటుంబసభ్యులు హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీఆర్‌ఓ నారాయణస్వామి, వీఆర్‌ఏలు కలిసి ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: ఎంపీడీఓ

ముదిగుబ్బ, మార్చి28: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతిఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని ఎంపీడీఓ. నాగేశాచలరెడ్డి సూచించారు. మండలంలోని దొరిగల్లు, మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, కొండగట్టుపల్లిలలోని గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిపై పలు ఆదేశాలు జారీ చేశారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

బుక్కపట్నం,మార్చి 28: మండలకేంద్రంలోని తేరుకూడలిలో బసవేశ్వరస్వామి ఆలయ కమిటీ వారు గురువారం చలివేం ద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంజీవరాయుడు, దాసరి శ్రీనివాసులు, నాగభూషణం, గాజులబాలాజీ, సతీష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కదిరి లీగల్, మార్చి 28: కదిరి న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు విజయనాగేశయ్య, కే. నాగేంద్ర కుమార్ రెడ్డి పోటీ పడ్డారు. నాగేశయ్యకు 24 ఓట్లురాగా, నాగేంద్రకుమార్‌రెడ్డికి 65ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడిగా నాగేంద్రకుమార్‌రెడ్డిని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కె. రమేష్, ప్రధాన కార్యదర్శిగా టీ. సురేం ద్ర, జాయింట్ సెక్రెటరీగా జీ. గంగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సభ్యులకు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

బీరువా, పుస్తకాలు వితరణ

కదిరిఅర్బన్, మార్చి28: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని ఉర్దూ శాఖకు గురువారం స్థానిక కరీమ్ రుమాని ఇరిగేషన్, చారిటబుల్ ట్రస్టు వారు బీరువాతోపాటు 250 పుస్తకాలు వితరణ చేశారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మితకు అందజేశారు. ట్రస్టు తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగా కళాశాలకు బీరువా, పుస్తకాలు అందించామని ట్రస్టు సభ్యుడు అబ్దుల్‌ఖాన్ పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

గోరంట్ల, మార్చి 28: పట్టణంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పది పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ. గోపాల్‌నాయక్ తెలిపారు. ఈనెల 18నుంచి పదిపరీక్షలు ప్రారంభం కాగా, చివరి రోజు గురువారం నాలుగు పరీక్షా కేంద్రా ల్లో సంస్కృతం పరీక్షను 45మంది రాశారు. వివేకా నందలో 11మంది, న్యూమాంటిస్సోరిలో 13, బాలికల ఉన్నత పాఠశాలలో 8, బాలుర ఉన్నతపాఠశాలలో 13మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు.

నేడు టీడీపీ మండల స్థాయి సమావేశం

రొద్దం, మార్చి 28: మండలంలోని ఆర్ మరువపల్లిలోని టీకే పార్థసారథి రైస్ మిల్లులో శుక్ర వారం టీడీపీ కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమా వేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ నరహరి గురువారం ఓ ప్రకటనలో కోరారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి టీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ముఖ్య అతిథులు పాల్గొంటారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశం అనంతరం తాడంగిపల్లి, మోపర్లపల్లి, ఎం కొత్తపల్లి, గౌరాజుపల్లి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెండు రోజులు ఏసీబీ తనిఖీలు

హిందూపురం, మార్చి 28: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులపాటు ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2019లో ఏసీబీ దాడులు జరిగాయి. ఆ కేసుకు సంబంధించి కొన్ని పత్రాలను పరిశీలించేందుకు వచ్చినట్లు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ మోహన్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి : జేసీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం అర్బన్, మార్చి 28: త్వరలో జరగనున్న సాధరణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌అభిషేక్‌కుమార్ స్థానిక అధికారులకు సూచించారు. ఆయన గురువారం హిందూపురం ఎంజీఎం పాఠశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రూరల్ పరిధిలోని 158,159,160,161పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, డీఎస్పీ కన్జక్షన్, మునిసిపల్ కమిషనర్, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, సిబ్బంది ఉన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్, మార్చి 28 : మండలంలోని నాగలూరులో సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి సతీమణి నాగమ్మ(50) అనారోగ్యంతో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి నాగమ్మ భౌతిక కాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆమె స్వగ్రామమైన నాగలూరులో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

బావిలో యువకుడి శవం లభ్యం

హిందూపురం, మార్చి 28 : మండలంలోని మరువ పల్లికి చెందిన మారుతి(27) అనే యువకుడు గ్రామ సమీపంలో వ్యవసాయ బావిలో శవమై తేలాడు. అప్ గ్రేడ్ పోలీసులు తెలిపిన మేరకు ... మరువపల్లికి చెందిన మారుతి ఈనెల 26న ఇంటి నుంచి వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు. అయితే అతడు తాగుడుకు బానిసై ఉండటంతో మూడు రోజులుగా కనబడకపో యినా కుటుంబసభ్యులు ఆరాతీయలేదని సమాచారం. అయితే గ్రామ సమీపంలోని లేఅవుట్‌లో పనిచేసే ఓ వ్యక్తి గురువారం ఉదయం అటుగా వెళుతుండగా బావిలో యువకుడి శవం గమనించి గ్రామస్థులకు తెలిపాడు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అది మరువపల్లికి చెందిన మారుతి మృతదేహంగా కుటుంబసభ్యులు, గ్రామస్థుల ద్వారా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు. అయితే అతడు తాగిన మత్తులో బావిలోపడ్డాడా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనేది పోలీసులు విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మడకశిర రూరల్, మార్చి 28 : స్థానిక మడకశిర - హిందూపురం ప్రధాన రహదారిలో అయ్యవారిపల్లి వద్ద గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో అశ్వత్థ అనే కూలీని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది. అతడికి తీవ్రగాయాలయ్యాయి. అశ్వత్థ అయ్యవారిపల్లి సమీపంలో ఉన్న కోళ్లఫారంలో కూలీగా పని చేస్తున్నాడు. రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చుట్టుపక్కల ఉన్నవారు ప్రమాదం జరిగిన విషయాన్ని వారి బంధువులకు తెలియజేశారు. అతడిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

వరుస చోరీలతో బెంబేలు



చిత్రశేఖర్ బోరు వద్ద స్టార్టర్, కేబుల్ చోరీకి గురైన దృశ్యం

మడకశిర టౌన్, మార్చి 28: అమరాపురం మండలంలో వరుసగా రైతుల బోరు బావులను లక్ష్యంగా చేసుకొని కొందరు చోరీలకు పాల్పడుతున్నారు. అమరాపురం, మద్దనకుంట తదితర గ్రామాల్లో గత వారం రోజుల్లో 20 మంది రైతుల వ్యవసాయ పొలాల వద్ద బోరుబావులకు సంబంధించిన కేబుల్, స్టార్టర్‌లను ఎత్తుకెళుతున్నట్లు గురువారం రైతు చిత్రశేఖర్ యాదవ్‌తో పాటు పలువురు రైతులు అమరాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు నిఘా పెట్టాలని, బోరు బావుల కింద సాగుచేసిన రాగి, మొక్కజొన్న, ఇతర పంటలు ఎండిపోతున్నాయని తమ ఆవేదన తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

నమో నారసింహా..!

- వైభవంగా మధుగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



సోమఘట్టలో భక్తుల మధ్య కదులుతున్న రథం, (ఇన్‌సెట్‌లో) రథంలో ఆశీనులైన స్వామి

చిలమత్తూరు, మార్చి 28: కదిరి పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మండలంలోని సోమఘట్ట మధుగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నర సింహ స్వామికి సుప్రభాత సేవతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి బ్రహ్మరథాన్ని సిద్ధం చేయగా, ఆలయ అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సేవకులు సంప్రదాయ మంగళవాయిద్యాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి తీసుకొచ్చారు. భక్తుల గోవింద నామ స్మరణ మధ్యన స్వామిని రథంపై ఆశీనులను చేశారు. దీంతో ఆల య ప్రాంగణమంతా నారసింహ నమోనమః అనే స్మరణ మార్మోగింది. ముం దుగా నిర్ణయించిన ముహూర్త సమయానికి రథం ముందుకు కదిలింది. భక్తులు వెంట తెచ్చుకున్న ధవనం, అరటిపండ్లను రథంపైకి చల్లి మొక్కులు తీర్చుకున్నా రు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ (వృత్తంలో..)

గోరంట్ల, మార్చి 28: మండల పరిధిలోని బూదిలి పంచాయతీలోని గంగాదేవిపల్లిలో గురువారం నిర్వహించి వైసీపీ ఎన్నిక ప్రచారంలో గ్రామ వలంటీర్ బోయ రమేష్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ బూదిలి శ్రీనివాసరెడ్డి , సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో గంగాదేవి పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికెళ్లి ప్రచారం నిర్వహిస్తుండగా ఆ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వలంటీర్ బోయ రమేష్ పాల్గొన్నారు. ఈవిషయంపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వీఆర్‌ఓ ద్విచక్రవాహనం చోరీ



ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి (సీసీ టీవీ ఫుటేజీ)

మడకశిరటౌన్, మార్చి 28: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో బుధవారం రాత్రి ఉంచిన హరేసముద్రం వీఆర్‌ఓ శశాంక్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తన స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరడంతో వీఆర్‌ఓ పరామర్శకు వెళ్లారు. ఆ సమయంలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు ఆయన మడకశిర పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలో వీఆర్‌ఓ ద్విచక్ర వాహనం దొంగలిస్తున్న దృశ్యాలు నమోదు కావడంతో వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'తల్లిదండ్రులే మొదటి గురువులు'



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

హిందూపురం అర్బన్, మార్చి 28: ప్రతిఒక్కరికి తల్లిదండ్రులే మొదటి గురువులని విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల కార్యదర్శి జయప్రకాష్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని విద్యారణ్య పాఠశాలలో గురు వారం మాతా పితృ వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో ఉపాధ్యాయులు ఎంత ముఖ్యమో తల్లి తండ్రులు అంతకంటే ముఖ్యమన్నారు. తల్లితండ్రుల ఆశీర్వాదం ఉంటే ఎంతటి కార్యాన్నైనా సునాయసంగా జయించవచ్చని బోధించారు. అనంతరం 140 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు.

ప్రజాగళం సభకు వెళ్లిన గుండుమల, సునీల్



ఉమ్మడి జిల్లా నాయకులతో కలిసి స్వాగతం పలుకుతున్న గుండుమల

మడకశిరటౌన్, మార్చి 28: ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబును కలిసేందుకు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తదితర నాయకులు నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడుకు తరలి వెళ్లారు. టీడీపీ ఉమ్మడి జిల్లా నాయకులతో పాటు పుష్పగుచ్ఛాలతో చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సునీల్‌కుమార్

నేడు రొళ్లలో టీడీపీ అభ్యర్థి సునీల్ ప్రచారం

రొళ్ల, మార్చి 28: టీడీపీ, జనసేన, బీజేపీ మడకశిర నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ మద్దనకుంట సునీల్‌కుమార్ శుక్రవారం రొళ్ల మండలంలో పర్యటిస్తున్నట్లు రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ పీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, రాష్ట్ర వక్కలిగ డైరెక్టర్ నారాయణప్ప గురువారం తెలిపారు. రొళ్ల మండలంలో హొట్టేబెట్ట పంచాయతీ నుంచి ప్రారంభించి మల్లినమడుగు వరకు ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక

రొళ్ల, మార్చి 28: మండలంలోని పలు గ్రామలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమంతనపల్లి, కే గొల్లహట్టి, ఆర్ గొల్లహట్టి గ్రామాలకు చెందిన లోకేష్‌గౌడ, చిక్కన్న, గోవిందరాజు, శిరీష్, రము, కృష్ణమూర్తి, చిక్కప్పయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌడప్ప ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చలేదని, నవరత్నాలు ఒట్టి మాటలకే పరి మితమయ్యాయని కాంగ్రెస్‌లో చేరిన వారు అన్నారు. దీంతో వైసీపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. మాజీ సర్పంచి నాగరాజు, దొమ్మరహట్టి రామప్ప, శేషాద్రి, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సూగూరు ఆలయ హుండీ లెక్కింపు

హిందూపురం అర్బన్, మార్చి 28: పట్టణ పరిధిలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం హుండీని గురువారం ఈఓ. నరసింహరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. ఐదు నెలల ఎనిమిది రోజులకు గాను ఆదాయం రూ.1,06,312 అని ఈఓ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయం ఖాతాలోకి వేస్తామన్నారు. కాగా ఈ ఆలయానికి కమిటీ లేకపోవడంతో అర్చకుడు, కొంత మంది పరిసర గ్రామ ప్రజలకు తెలియజేశామన్నారు. సూగూరులో ముఖ్యమైన వారిని కాకుండా అమాయకులను పిలిపించి లెక్కించారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సూగురు గ్రామ ప్రజలకు తెలియజేసి అర్చకుడి సమక్షంలోనే లెక్కించామని ఈఓ పేర్కొన్నారు.

పంచాయతీ నీటితో వనం పెంపకం

రొద్దం, మార్చి 28 : వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు తహతహలాడుతుంటే కోగిర గ్రామానికి చెందిన పాల నరసింహులు అనే వ్యక్తి ఏకంగా పంచాయతీ నీటితో ఇంటి వద్ద వనాన్ని పెంచి పోషిస్తున్నాడు. రొద్దం మండల పరిధిలోని కోగిర గ్రామంలో కంచిస ముద్రం వెళ్లే దారికి ఎడమవైపున అతడు ని వాసం ఉంటున్నాడు. తన ఇంటివద్ద పంచాయతీ నీటితో టెంకాయ చెట్లు, అవిశ చెట్లు పెంచుతున్నాడు. అందులోనే రాగిపంటను సాగుచేశాడు. అయితే గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే... అతడు చెట్ల పెంపకానికి నీటిని తోడేస్తు న్నాడని తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై ఎన్నో మార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికా రులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా... ఈ విషయం తన దృష్టికి రాలేదని సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.





పంచాయతీ నీటితో పాల నరసింహులు పెంచుతున్న వనం, సాగుచేసిన రాగిపంట

కోడ్‌ను పట్టించుకోరా...?





మానెంపల్లిలో నీటి ట్యాంకు, దుకాణంపై సీఎం చిత్రం ఉన్న స్టిక్కర్లు

హిందూపుం, మార్చి 28: ఎన్నికల కోడ్ వచ్చి 12రోజులవుతోంది. అయినా కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు రాజకీయ నాయకుల ఫొటోలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు పబ్లిక్ ప్రదేశాల్లో ఉండకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ జిల్లా అధికారులు వాటిని అమలు చేయడంలో ని ర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. హిందూపురం నియోజకవర్గంలో పలుచోట్ల ఇప్పటికీ ముఖ్యమంత్రి ఫొటోలున్న స్టిక్కర్లు, వైసీపీ రంగులు ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి. మరీ ముఖ్యంగా పల్లెల్లో అయితే జగన్ బొమ్మతో ఉన్న స్టిక్కర్లు ఎక్కడ చూసినా కనబడుతున్నాయి. ప్రతి పంచాయతీకి గ్రామ వార్డు సచివాలయం ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని బహిరంగంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు.

గోరంట్ల: మేజర్ పంచాయతీ పరిధిలోని సిరగంవాండ్లపల్లిలో నివాస గృహాలు, పశువుల పాకలపై వైసీపీ జెండాలు ఎరుగుతుండడంతో గ్రామానికి ఎన్నికల కోడ్ వర్తించా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. షెడ్యూల్ విడుదలై 12 రోజులు గడుస్తున్నా సంబంధి తాధికారులు ఏమి చేస్తున్నారంటు న్నారు. ఇప్ప టికైనా అధికారులు చర్యలు తీసు కోవాలని ఫొటోలు తీసి సోషల్ మీడియా ద్వారా కోరుతున్నారు.



సిరగంవాండ్లపల్లిలో ఎగురుతున్న వైసీపీ జెండాలు

వైసీపీకి ఓటమి ఖాయం: సవిత



ఇంటింటి ప్రచారంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలోని షిర్డీ సాయి బాబా వీధిలో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. దాదాపు 80 శాతం హామీలను ఎగ్గొటినందుకు జగన్ పార్టీ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. మద్య నిషేధం హామీపై మడమ తిప్పాడని, నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడాడరన్నారు. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచడమే కాకుండా కరెంటు కోతలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టారన్నారు. స్మార్టు మీటర్లు, వ్యవసాయ మీటర్ల కొనుగోలులో వేల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా చేశారన్నారు. ఏది ఏమైనా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఆవుల నరేంద్ర, నాయకులు శ్రీరాములు, కోనాపురం రామలింగ, రము వీర చౌదరి, సుబ్రహ్మణ్యం, మాధవనాయుడు, బాబుల్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు దాదు, షమీన్, చంద్రకాంతమ్మ, రమణమ్మ తదితరలు పాల్గొన్నారు.

పురం ప్రశాంతతకు టీడీపీని ఆదరించండి

ఇంటింటి ప్రచారంలో నాయకులు



సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 28 : నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన గురువారం టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలోని కోట ప్రాంతంలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించి క్యాలెండర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ ఎమ్మెల్యేగా గెలిచి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే హిందూపురం పట్టణంతోపాటు నియోజకవర్గంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు, దౌర్జన్యాలు ఉండవన్నారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో నియోజకవర్గంలో ఎక్కడైనా ఒక్క భూదందా జరిగిందా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ ప్రజలపక్షాన ఉంటుందని, అనుభవం కలిగిన చంద్రబాబుకు మన మద్దతు ఇచ్చి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు జేపీకే రాము, పట్టణాధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్ రామచంద్ర, మోదాశివ, మురళి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఎంపిక



ఎంపికైన సభ్యులకు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి నాగరాజు

పెనుకొండ, మార్చి 28 : న్యాయవాదుల సంఘం పెనుకొండ నూతన కార్య వర్గాన్ని గురువారం ఏక గ్రీవంగా ఎన్ను కున్నారు. స్థానిక బార్ అసోసియే షన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం లో నూతన అధ్యక్షుడిగా వాల్మీకి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కురుబ అశ్వత్థనారాయణ, సంయుక్త కార్యదర్శిగా జావిద్‌హుస్సేన్, కోశాధికారిగా విక్రాంత్‌నాయక్, గ్రంథాలయ కార్యదర్శిగా బోయ లీలారాణిని ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గసభ్యులుగా నాగిరెడ్డి, బాలా జీ, రంగనాథ్, ఎంపికయ్యారు. ఎన్నికల అధికారులుగా నాగరాజు, శివశర్మ వ్యవహరించారు. అనంతరం నూతన సభ్యులకు ఎన్నికల అధికారి నాగరాజు డిక్లరేషన్ ఫారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమా పావనిరాయల్, కిరణ్‌కుమార్, బాలాజీ న్యాయవాదులు, గుమాస్తాలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుడిబండ, మార్చి 28 : మండలంలోని కెరికెర గ్రామ సమీపంలోని కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సి పాల్ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతికి 40సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీకి 40సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ సీట్ల భర్తీ కోసం విద్యార్థినులు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు నడుం బిగించిన యువత



స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేస్తున్న దృశ్యం

హిందూపురం, మార్చి 28 : పట్టణ నడిబొడ్డున స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అయితే వాహన దారులు రాత్రిపూట వాటిని గుర్తించక వెళుతుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా ద్విచక్రవాహనంలో వెళ్తున్న వారు స్పీడ్ బ్రేకర్లను గుర్తించక కిందపడి గాయాలపాలయ్యారు. ఇదిచూసిన అల్‌మదత్ సామాజిక సేవా సంస్థ సభ్యులు స్పందించి రాత్రికి రాత్రే స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేశారు. ఈ కార్యక్రమంలో యువకులు అల్తాఫ్, షౌకత్, తౌసిఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

31లోగా పన్నులు చెల్లించండి

వడ్డీరాయితీ పొందండి: కమిషనర్

పెనుకొండ, మార్చి 28: నగర పంచాయతీకి సంబంధించిన ఇంటి పన్ను, నీటి పన్ను తదితర పన్నులను ఈ నెల 31లోగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1నుంచి పన్నుపై మరోమారు వడ్డీ జమ అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలను ఏకమొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర పంచాయతీ ప్రజలు ఈ నెలాఖరులోగా ఆస్తి, కొళాయి, ఖాళీ స్థలాల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. ఈ నెలాఖరువరకు వేచి చూడకుండా ముందుగానే పన్నులు చెల్లించాలని నెలాఖరులో సర్వర్, ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. సెలవు రోజుల్లోనూ పెనుకొండ నగరపంచాయతీ క్యాష్ కౌంటర్లు ఉదయం 8గంటలనుంచి రాత్రి 8గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.